క్లుప్తంగా

అంగన్‌వాడీలకు రెండో దశ శిక్షణ

కాకినాడ క్రైం: అంగన్‌వాడీల అభివృద్ధికి రూపొందించబడిన పోషణ్ భీ, పఢాయి భీ రెండో దశ శిక్షణ మంగళవారం ప్రారంభం కానుంది. స్థానిక ముత్తానగర్ హైస్కూల్‌లో సీడీపీవో జ్యోతి ఆధ్వర్యంలో ఈ శిక్షణ మూడు రోజుల పాటు కొనసాగుతుంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ విజయకుమారి పర్యవేక్షణలో జరిగే ఈ శిక్షణకు కాకినాడ ప్రాజెక్టు పరిధిలోని 85 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరుకానున్నారు. ఆదర్శశీల, నవచేతన అనే అంశాలపై శిక్షణ జరగనుంది. సెక్టార్ సూపర్‌వైజర్లు ప్రభావతి, దయామణి, అరుణశ్రీ, అరుణ దుర్గాంబిక శిక్షకులుగా వ్యవహరిస్తారు.

చేపల చెరువుకు వేలం ఖరారు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని ముక్తికా సరస్సును ఆనుకుని ఉన్న చెరువులో మూడు నెలల కాల పరిమితితో చేపలు పట్టుకునేందుకు సోమవారం వేలం పాట నిర్వహించారు. మొత్తం నలుగురు పాల్గొనగా, రూ.1.08 లక్షలకు హెచ్చు పాటదారుడికి ఖరారు చేసినట్టు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. గతంలో పలుమార్లు చెరువు వేలం పాట వాయిదా పడింది. అలాగే ఆలయ ప్రాంగణంలో జరిగే వివాహాది శుభకార్యాలకు ఫొటో, వీడియో షూటింగ్ లైసెన్స్ హక్కు కోసం వేలం పాటలో రూ.1,03,500 ఖరారు కావడంతో, ఆదనపు ఆదాయం లభించిందన్నారు. జగన్నాథపురం గ్రూపు దేవాలయాల ఈఓ పర్యవేక్షణలో వేలం పాటలు జరిగాయన్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విశ్వనాథరాజు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): నగరంలోని రామారావుపేట పొట్టి శ్రీరాములు కూడలిలో బీజేపీ జిల్లా కార్యాలయాన్ని సోమవారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోదావరి జిల్లాల జోనల్ ఇన్‌చార్జి సాగి కాశీ విశ్వనాథరాజు ప్రారంభించారు. అనంతరం పూజలు, సత్యనారాయణ మూర్తి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బిక్కిన విశ్వేశ్వరరావు, పైడా కృష్ణమోహన్, మాలకొండయ్య, పైడా భావనప్రసాద్, కవికొండల భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల పంపిణీ



దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేస్తున్న డీఆర్వో

కాకినాడ సిటీ: జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్కటి రూ.35 వేల విలువైన నాలుగు ల్యాప్‌టాప్‌లను సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో జె.వెంకటరావు దివ్యాంగులకు అందజేశారు. వారు చేసిన దరఖాస్తు మేరకు వీటిని మంజూరు చేశారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపర్చగా, నలుగురికి రెండు రోజుల చొప్పున జైలు, 17 మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

పాడా పీడీ చైత్రవర్షిణి

పిఠాపురం: పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) పరిధిలో వచ్చిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సంస్థ పీడీ చైత్రవర్షిణి అధికారులకు ఆదేశించారు. ఆమె సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి సోమవారం పాడా కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో మొత్తం 90 అర్జీలు వచ్చాయని, వీటిలో రెవెన్యూ 31, మున్సిపాలిటీ 20, అగ్రికల్చర్ 5, పింఛన్లు 11, ఇతర సమస్యలకు సంబంధించి 23 అర్జీలు అందినట్టు వివరించారు. పాడా ఏపీడీ వసంతమాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేల్కోకుంటే.. తాగు నీటి కష్టాలే!

- గ్రామాల్లో పొంచి ఉన్న నీటి ఎద్దడి ముప్పు
- పెరుగుతున్న వేసవి తీవ్రత



పండూరు సీపీడబ్ల్యూఎస్ వద్ద స్టోరేజ్ ట్యాంక్



పండూరు గ్రామంలోని సీపీడబ్ల్యూ స్కీమ్

కాకినాడ రూరల్: వేసవి వస్తుందంటే.. ముందుగా గుర్తుకొచ్చేది తాగునీటి కష్టాలే. ఇటీవల పగటి ఉష్ణోగ్రత అమాంతం పెరుగడంతో.. నేల వేడెక్కి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ప్రస్తుతం వేసవి తీవ్రత క్రమేణా పెరుగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు 33 సెల్సియస్ డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తు ప్రణాళికతో కార్యాచరణ చేపట్టకపోతే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు.

కాకినాడ రూరల్ మండలంలో 18 పంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీల్లో లక్షా 83 వేల 183 మంది జనాభా ఉన్నారు. గ్రామాల్లో సుమారు 63 ఓహెచ్ఆర్ ట్యాంకులు, వీటిలో 43ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. కొన్ని ట్యాంక్‌లు నిర్మాణాల్లో ఉండగా, కొన్ని మరమ్మతులు చేపడుతున్నారు. పబ్లిక్, ప్రైవేట్ కుళాయిలు సుమారు 33వేల వరకు ఉన్నాయి, పండూరు, తూరంగి గ్రామాల్లో సీపీడబ్ల్యూ స్కీమ్‌ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుంది. పండూరు సీపీడబ్ల్యూఎస్ ద్వారా 1.30 లక్షల మందికి, తూరంగి సీపీడబ్ల్యూఎస్ ద్వారా సుమారు 35 వేల మందికి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు.

వేసవిలో కటకటే..!

మండలంలోని తూరంగి గ్రామంలో ఏటా తాగునీటి కష్టాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలో ప్రవేశించడంతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. గతేడాది గ్రామస్తుల తాగు నీటి కష్టాలు తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్, 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా కోసం కోట్లాది రూపాయలతో పనులు జరుగుతున్నాయి. ఈ వేసవిలో తాగునీటి కష్టాలు లేకుండా, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే నీటిఎద్దడిని సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంది.

ప్రణాళికాబద్ధంగా ఎదుర్కొంటాం

కాకినాడ రూరల్ మండలంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. పండూరు సీపీడబ్ల్యూఎస్ పరిధిలో మైనర్ రిపేర్లను చేపడుతున్నాం. తూరంగిలో ఏటా నీటిఎద్దడి వస్తున్నందున ఈ ఏడాది అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గ్రామానికి నీటి సరఫరా చేసే సీపీడబ్ల్యూఎస్‌కు నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక రూపొందించాం. నడకుదురు వద్ద క్రాస్ బండ్ నిర్మాణానికి రూ.2 లక్షలతో ప్రతిపాదనలు చేశాం. ఏప్రిల్ 30న పంట కాల్వలకు నీటి సరఫరా నిలుపుదల చేస్తారు. నడకుదురు వద్ద ప్రతిపాదించిన క్రాస్ బండ్ నిర్మాణం వల్ల కాల్వలో నీటిని సీపీడబ్ల్యూఎస్‌కు మళ్లిస్తాం.

– మారుతీరావు, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కాకినాడ రూరల్

జాబ్‌మేళాను సందర్శించిన కలెక్టర్



జాబ్‌మేళాపై పీడీ లచ్చారావుతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: వికాస సంస్థ ద్వారా నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి సందర్శించారు. వసతులు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న తీరు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ జాబ్‌మేళాకు 1,200 మంది అభ్యర్థులు హాజరుకాగా, 125 మంది ఉద్యోగాలు పొందారన్నారు. ఈ జాబ్‌మేళా మంగళవారం కూడా కొనసాగుతుందన్నారు. వర్క్ ఫ్రం హోమ్ విధానంలో గూగుల్ సంస్థ తరపున పని చేస్తున్న సంస్థ కంటెంట్ అనలిస్ట్ ఉద్యోగాలకు వాకిన్ డ్రైవ్ నియామకాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిగ్రీల్లో పాసైన వారంతా ఈ ఎంపికకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన వారికి రూ.2.11 లక్షల నుంచి రూ.3.2 లక్షల వార్షిక ప్యాకేజీ ఉంటుందన్నారు. శిక్షణ కల్పించి, ల్యాప్‌టాప్ కూడా కంపెనీ ఏర్పాటు చేస్తుందన్నారు. వికాస పీడీ లచ్చారావు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలు



శిక్షణ ఇస్తున్న డీఆర్పీ దుర్గాప్రసాద్. చిత్రంలో తహసీల్దార్ సత్యనారాయణ

కరప: రైతులు పండించిన రబీ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల(ఆర్‌ఎస్‌కే) ద్వారా నిబంధనల మేరకు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై వీఆర్‌ఓలు, వీఏఏలు, ఆర్‌ఎస్‌కే ధాన్యం కొనుగోలు సిబ్బందికి ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రైతు కళ్లాల్లో ధాన్యం శాంపిళ్లను సేకరించి, రైసు మిల్లుకు చేరవేసే వరకు నిబంధనలు పాటించాలన్నారు. మండలంలోని పది రైసు మిల్లుల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. రబీ ధాన్యం కొనుగోలులో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఎంఏఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందడంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 16 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. ఈ సందర్భంగా కళ్లాల్లోని ధాన్యం శాంపిళ్లను సేకరించడం, తేమ శాతం పరీక్ష, ఎఫ్‌టీఓ రశీదు పూర్తిచేయడం, రైసు మిల్లులకు ధాన్యం చేరవేయడం తదితర అంశాల్లో సివిల్ సప్లయిస్ ప్రతినిధి, జిల్లా రీసోర్స్‌పర్సన్ దుర్గాప్రసాద్ శిక్షణ ఇచ్చారు.

ఆధునిక చికిత్సతో క్షయ నివారణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ



ఉచిత వైద్య శిబిరంలో వ్యక్తిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్

కాకినాడ రూరల్: ప్రాణాంతకమైన క్షయను ఆధునిక చికిత్సతో పూర్తిగా నివారించవచ్చని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బోట్‌క్లబ్ ఉద్యానవనంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ, 1982 నుంచి మార్చి 24న క్షయ వ్యాధి నివారణ దినాన్ని జరుపుతున్నారన్నారు. పోషకాహార లోపం, మద్యపాన, ధూమపాన అలవాట్లు, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. జ్వరం, వణుకు, రాత్రి చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, కోశాధికారి రాఘవరావు, ప్రసాద్‌నాయుడు, ఎం.సుబ్బారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాక్టీరియాతో కలిగే వ్యాధి

మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియాతో క్షయ వ్యాధి(టీబీ) వస్తుందని, ఇది పురాతన కాలం నుంచి ప్రపంచాన్ని పీడిస్తున్న వ్యాధి అని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ భీమశంకర్ అన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రిలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనిట్ హెడ్ శుభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బోట్‌క్లబ్: ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతక అంటు వ్యాధి క్షయ (టీబీ) అని ప్రముఖ శ్వాసకోశ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ గంటా ప్రవీణ్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జనతా ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్షయ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని నాశనం చేస్తోందని, తీవ్ర ఆరోగ్య, సామాజిక, ఆర్థిక పరిణామాలకు కారణమవుతోందన్నారు. వ్యాధిగ్రస్తులతో సన్నిహిత సంబంధాలకు దూరంగా ఉండటం, వైద్యుడు సూచించిన మందులన్నింటినీ సక్రమంగా తీసుకోవడం, వ్యక్తిగత రక్షణ పరికరాలను ఉపయోగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టీబీ మహమ్మారిని అంతం చేసే ప్రయత్నంలో కలసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, సభ్యులు వీవీ రావు, సిరాజ్, శ్రీవల్లీ పాల్గొన్నారు.

మంచి నడవడిక అలవర్చుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీదేవి

కాకినాడ లీగల్: చిన్ననాటి నుంచే మంచి నడవడిక అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరవచ్చని కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి అన్నారు. కాకినాడ భాష్యం పబ్లిక్ స్కూల్‌లో సోమవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమెతో పాటు, ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడానికి, రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టాన్ని రూపొందించారన్నారు. పోక్సో చట్టంతో పాటు, వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే ఇంట్లో వాళ్లకు, పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

నాడు రూ.లక్షలు వెచ్చించి..

నేడు పీకి పారేసి..



పీకి వృథాగా పారేసిన స్టీల్ బోర్డులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో ఎస్‌బీఐ సీఎస్సార్ నిధులతో కొన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వర్సిటీలోనే ఎస్‌బీఐ బ్రాంచ్ ఉండటంతో పాటు, అత్యధిక లావాదేవీలు ఈ శాఖ ద్వారానే జరిగాయి. దీంతో కళాశాలకు బ్యాటరీ వాహనాలతో పాటు, ముఖ్యమైన కూడళ్లు, బిల్డింగ్ పేర్లు తెలుపుతూ స్టీల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఏడాది కాలం తర్వాత వర్సిటీలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టడంతో, వాటిని పొక్లెయిన్‌తో పీకి పారేశారు. సమాచారం తెలిపే ఈ బోర్డులు ఆకర్షణీయంగా ఉండేవని, ఇపుడు వృథాగా పడేశారని చర్చించుకుంటున్నారు. సక్రమంగా తొలగించి ఉంటే, రోడ్డు పనులు పూర్తయ్యాక మళ్లీ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండేదని అంటున్నారు.

నక్షత్ర, పాద శివాలయాల్లో రుగ్వేద పారాయణం



కరపలో రుగ్వేద పారాయణం చేస్తున్న పండితులు

కరప: లోక కల్యాణం కోసం భీమ ఖండంలో ఉన్న నక్షత్ర, పాద శివాలయాల్లో రుగ్వేద పారాయణం చేయడానికి సంకల్పించినట్టు రుగ్వేద పండితులు ఇందుర్తి కామేశ్వరశర్మ ఘనపాఠి, గూడపూడి ప్రభాకరశర్మ ఘనపాఠి, గుండు పవన్‌శర్మ ఘనపాఠి, గూడపూడి సూర్యచరణ్‌శర్మ ఘనపాఠి, ఇందుర్తి సూర్యనారాయణశర్మ ఘనపాఠి తెలిపారు. కరప గ్రామంలో పునర్వసు నక్షత్రం, రెండోపాదంలో వేంచేసిన పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారి సన్నిధిలో సోమవారం పండితులు రుగ్వేద పారాయణాన్ని ప్రారంభించారు. శివాలయంలో ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్ పూజాది కార్యక్రమాలు చేశారు. ప్రదోష కాలంలో నీరాజన మంత్రపుష్పం, పంచ హారతులు, చతుర్వేద స్వస్తి, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

వక్ఫ్ బిల్లుకు వైఎస్సార్ సీపీ వ్యతిరేకం



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో మైనార్టీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: వివాదాస్పదంగా మారిన వక్ఫ్ బిల్లుకు వైఎస్సార్ సీపీ పూర్తి వ్యతిరేకమని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని పెద్ద మసీద్‌లో మసీద్ అధ్యక్షుడు ఎస్.ఇజాజుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు కఠిన ఉపవాసం ఉండి, భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకొంటారన్నారు. ఉపవాస దీక్షలు చేసిన వారి ఆకాంక్షలు తీరాలని అల్లాను కోరుకున్నట్లు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు ప్రవేశపెడితే వైఎస్సార్ సీపీ వ్యతిరేకంగా ఓటు వేస్తుందని, ఇప్పటికే ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మాజీ సభ్యులు అబ్దుల్ బషీరుద్దీన్, రెహ్మాన్‌ఖాన్, పార్టీ మైనార్టీసెల్ నగర అధ్యక్షుడు ఖాలీద్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు బాషా, పార్టీ నాయకులు అజ్జు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో మా పొట్టలు కొట్టొద్దు

కలెక్టరేట్ వద్ద మీటర్ రీడర్ల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మీటర్ రీడర్లు

కాకినాడ సిటీ: కొత్తగా వచ్చిన స్మార్ట్ మీటర్ల వల్ల ఉద్యోగాలు కోల్పోతున్నామని, దీనివల్ల తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వీరబాబు మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా ఇంటింటికీ వెళ్లి విద్యుత్ బిల్లులను తీస్తూ, కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలవారీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో తమను తొలగించే చర్యలు సరికావన్నారు. స్మార్ట్ మీటర్లు వస్తే తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని గతంలో అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దానిని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం డివిజన్ నాయకులు జి.రామకృష్ణ, పి.నానాజీ, జి.మాధవ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలి

వంతాడ గ్రామ గిరిజనుల సాగులో ఉన్న కొండ పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలంటూ సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ఈ.గోకవరం పంచాయతీ వంతాడ గ్రామంలో ఆదివాసీ గిరిజన కొండదొర కులానికి చెందిన 83 కుటుంబాలు ఏలేశ్వరం రేంజ్ లింగంపర్తి సెక్షన్ బీటు, కంపార్ట్‌మెంట్ నంబర్ 589లో ఒక్కొక్క గిరిజన కుటుంబం 2 నుంచి 3 ఎకరాల్లో జీడిమామిడి తోటలు వేసుకుని, 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ గ్రామంలో అభివృద్ధి పనులు కానీ, ఉపాధి హామీ పనుల కానీ ఉండవని, పూర్వం నుంచి ఎత్తయిన నాగులకొండ పర్వతం పైనే జీవనం సాగిస్తున్నామని వివరించారు. తమ సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాలు మంజూరు కాకుండా కొందరు అడ్డుపడుతున్నారన్నారు. అధికారులు తమకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినోద్ మిశ్రా ఆర్గనైజేషన్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు, ఉల్లి తాతారావు, కూడే లోవరాజు, ఉల్లి లక్ష్మి, కోటిపల్లి కొండమ్మ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి బుల్లబ్బాయిరెడ్డి కాలనీవాసులకు వీధిలైట్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం కల్పించాలంటూ ఆర్‌సీపీఐ ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి శివకోటి రాజు, కమిటీ సభ్యులు ముత్తాబత్తుల నాగమణి, వడ్లమూరి మంగ, టి శ్రీను కెవిరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పాపిడి దొడ్డి చెరువును తవ్వేస్తున్న అక్రమార్కులు



మట్టి అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పిఠాపురం: మండలంలోని ఎఫ్‌కే పాలెం-విరవాడ గ్రామాల మధ్య సుమారు వంద ఎకరాల పాపిడి దొడ్డి చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతుండడంపై ఎఫ్‌కే పాలెం గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ తవ్వకాల నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఫిర్యాదు అందజేశారు. అనంతరం పెద్దాపురంలో ఉన్న నీటి పారుదల శాఖ ఈఈ శేషగిరిరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు ముమ్మిడి వెంకన్నబాబు, మలిరెడ్డి పల్లపురాజా, ముమ్మిడి వీరబాబు, రామిరెడ్డి శ్రీను, ముమ్మిడి తాతికొండ తదితరులు మాట్లాడుతూ, పాపిడి దొడ్డి చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు ఇటుక బట్టీల యజమానులు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టడం శోచనీయమన్నారు. ఈ క్రమంలో మట్టిని తవ్వి, తరలించడానికి తెచ్చిన పొక్లెయిన్, లారీలను ఆదివారం అడ్డుకున్నామన్నారు.అనేక మంది రైతాంగానికి పుష్కలంగా సాగునీరు అందిస్తున్న ఈ చెరువులో మట్టి తవ్వకాలు చేపడితే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సాగునీరు సక్రమంగా అందని పరిస్థితుల్లో నీటి ఎద్దడి ఏర్పడి, రైతాంగానికి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు ఈ చెరువులో తవ్వకాలు జరిపారని, ఇప్పుడు మరోసారి అక్రమ తవ్వకాలు చేపడితే భారీ గోతులు ఏర్పడి, ప్రజలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తవ్వకాలు జరపగా, అనేక పశువులు మృత్యువాత పడ్డాయని గుర్తుచేశారు. కొందరు వ్యక్తులు కూడా ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఇటువంటి అక్రమ తవ్వకాలు ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళతామని స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.